

సలామ్.. హస్నాబాద్

యువత సరిహద్దులో సేవ చేసే లక్ష్యంతో ఆర్మీలో చేరేందుకు ముందుకు వస్తున్నారు. 10లో▸



'ఫలితం' ఏముంది!

నవాబుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోంది. 10లో▸



వ్యసనాలకు దూరంగా..

గిరిజనులు వ్యసనాలకు దూరంగా ఉండి, దైవభక్తి పెంచుకోవాలని భోజూ మహరాజ్ పేర్కొన్నారు. 11లో▸

న్యూస్‌రీల్

ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

మర్పల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లు ప్రారంభమైనట్లు ప్రిన్సిపాల్ జీ ప్రమీల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతిలో మెరిట్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంఈసీ గ్రూపుల్లో 40 సీట్ల చొప్పున అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇంగ్లిష్ మాధ్యమంలో బోధన ఉంటుందని వివరించారు. కళాశాలలో హాస్టల్ వసతి ఉందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి దరఖాస్తు ఫారాన్ని నింపి పంపాల్సి ఉంటుందని తెలిపారు.

త్వరలో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం

భూమి చదును చేసే పనులు ప్రారంభం



భూమిని చదును చేసే పనులను ప్రారంభిస్తున్న ఎస్ఐ యాదగిరి, సిబ్బంది

దుద్యాల్: మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనుల్లో భాగంగా బుధవారం భూమిని చదును చేసే పనులను ఎస్ఐ యాదగిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుద్యాల్ గేటు సమీపంలోని సర్వే నంబర్ 1090లో గల 2.18 ఎకరాలను పోలీస్ స్టేషన్‌కు కేటాయించడం జరిగిందన్నారు. ఇందులో భవన నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం స్థలాన్ని చదును చేస్తున్నామని, త్వరలో ఉన్నతాధికారులు భూమిపూజ చేసి భవన నిర్మాణ పనులను ప్రారంభిస్తారని తెలిపారు. భూమి చదును చేసే పనులను ప్రొబిషన్ ఎస్ఐ విఠల్, సిబ్బంది అమృత, యాదయ్య తదితరులు పరిశీలించారు.

మేమున్నాం.. ధైర్యంగా ఉండండి

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



రాయల్ కాలనీలో నిర్వహించిన కవాతులో పాల్గొన్న డీసీపీ సునీతారెడ్డి తదితరులు

పహాడీషరీఫ్: భారత్, పాకిస్తాన్ దేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో సున్నితమైన బాలాపూర్, పహాడీషరీఫ్ ఠాణాల పరిధిలో పోలీసులు బుధవారం సాయంత్రం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. మహేశ్వరం డీసీపీ డి.సునీతారెడ్డి పర్యవేక్షణలో కేంద్ర బలగాలతో కవాతు చేస్తూ స్థానిక ప్రజల్లో ధైర్యం నింపే ప్రయత్నం చేశారు. బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గణేశ్ చౌక్ నుంచి మొదలైన కవాతు బాలాగార్డెన్, రాయల్ కాలనీ, ఫాతిమా మజీద్ మీదుగా గుర్రం చెరువు వరకు కొనసాగింది. పహాడీషరీఫ్ ఠాణా పరిధిలో చార్మినార్ మజీద్ నుంచి ప్రారంభమైన ఫ్లాగ్‌మార్చ్ వై జంక్షన్, జల్‌పల్లి కమాన్ మీదుగా షాహిన్‌నగర్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో మహేశ్వరం, ఇబ్రహీంపట్నం డివిజన్ల ఏసీపీలు పి.లక్ష్మీకాంత రెడ్డి, రాజు, బాలాపూర్, పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు ఎం.సుధాకర్, గురువారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చల్లని ఉపాధి

మండు వేసవిలో సీజనల్ వ్యాపారం



పుచ్చకాయలు విక్రయిస్తున్న వ్యాపారి

- తాండూరు కూడళ్లలో ప్రత్యేక దుకాణాలు
- జ్యూస్‌లు, పండ్లు, పండ్ల రసాలు తాటిముంజల విక్రయం

సీజనల్ వ్యాపారం ఎంతో మందికి ఉపాధి కల్పిస్తోంది. వ్యవసాయ, కూలీ పనులు పెద్దగా దొరకని మండు వేసవిలో ఆదాయ వనరుగా నిలుస్తోంది. పక్క జిల్లాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి 'బిజీ'నెస్‌గా మారి, నాలుగు రాళ్లు సంపాదించుకునేందుకు దోహదపడుతోంది.

తాండూరు టౌన్: వేసవి ఎండలకు జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నీడ పట్టున ఉంటూ ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చక్కబెట్టుకుంటున్నారు. ఉక్కపోత, వేడికి తట్టుకోలేక చల్లని నీడను ఆశ్రయించడంతో పాటు శీతల పానీయాలను ఎక్కువగా తాగుతున్నారు. ఈ క్రమంలోనే డీహైడ్రేషన్‌కు గురికాకుండా, వడదెబ్బ తగలకుండా గొడుగుతో బయటకు వెళ్తున్నారు. ఈ సమయంలో లస్సీ, జ్యూస్, సోడా, నిమ్మరసం, కూల్‌డ్రింక్స్ వంటివి సేవిస్తున్నారు. తాండూరు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి నిత్యం పెద్దసంఖ్యలో జనం వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వస్తుంటారు. రోడ్డుకు ఇరువైపులా, ముఖ్య కూడళ్ల వద్ద వెలిసిన సీజనల్ దుకాణాలు వీరిని సేద తీరుస్తున్నాయి. జ్యూస్‌లతో పాటు కొబ్బరిబొండాలు, పుచ్చకాయలు, లస్సీ తాగడంతో పాటు, తాటి ముంజలను ఇష్టంగా తింటున్నారు. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఏర్పాటు చేసిన దుకాణాల్లో జనాలకు అవసరమైన శీతల పానీయాలు, పండ్లు లభిస్తున్నాయి. ప్రత్యేకంగా వెలిసిన షాపుల ద్వారా పలువురికి ఉపాధి లభిస్తోంది. మహబూబ్‌నగర్, మెదక్, సంగారెడ్డి తదితర జిల్లాల నుంచి వచ్చిన వారు స్థానికంగా షాపులు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఇక్కడే ఉంటారు.



ఫ్రూట్ జ్యూస్‌ల విక్రయం



తాటి ముంజలు తీస్తున్న విక్రయదారులు

తాటి ముంజలపై మక్కువ

వేసవి కాలంలో చాలా మంది తాటి ముంజలు తినేందుకు మక్కువ చూపుతారు. తాండూరు ప్రాంతంలో తాటి చెట్లు పెద్దగా లేకపోవడంతో చుట్టు పక్కల నుంచి తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. డజనుకు రూ.వంద చొప్పున తాజా ముంజలను అమ్ముతున్నారు. రెండు నెలల పాటు ఇదే తమకు బువ్వ పెడుతుందని గ్రామీణ చిరు వ్యాపారులు చెబుతున్నారు.

సీమనుంచి వచ్చి..

రాయలసీమ ప్రాంతానికి చెందిన సుమారు 50 కుటుంబాలు ఏటా వేసవి సీజన్ ప్రారంభం కాగానే తాండూరుకు చేరుకుంటాయి. పలు అడ్డాల వద్ద దుకాణాలు ఏర్పాటు చేసుకుని ఫ్రూట్స్ సలాడ్, బాదంపాలు, నిమ్మరసం వంటి జ్యూస్‌లను విక్రయిస్తారు. నిత్యం రూ.3 వేల నుంచి రూ.4 వేల వ్యాపారం జరుగుతుందని చెబుతున్నారు. జూన్ వరకు ఇక్కడే ఉండి ఐదు నెలల పాటు వ్యాపారం చేస్తారు. సీజన్ ముగిశాక తిరిగి తమ సొంతూళ్లకు వెళ్తారు. ఖర్చులు పోనూ నెలకు కనీసం రూ.30 వరకు సంపాదిస్తామంటున్నారు.

ఏళ్లుగా ఇదే వ్యాపారం



కొన్నేళ్లుగా వేసవిలో తాండూరుకు వచ్చి పుచ్చకాయలు విక్రయిస్తున్నాం. మహబూబ్‌నగర్ ప్రాంతం నుంచి ట్రాన్స్‌పోర్టులో తెస్తాం. నిత్యం సుమారు క్వింటాలు నుంచి క్వింటాలున్నర వరకు అమ్ముతాం. ఎండలు తగ్గగానే స్వస్థలానికి వెళ్లిపోతాం.

– హైమద్, మహబూబ్‌నగర్ జిల్లా

రాయలసీమ నుంచి వచ్చాం



మాది రాయలసీమ ప్రాంతం. ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు పలు రకాల ఫ్రూట్ జ్యూస్‌లు అమ్ముతుంటాం. ఒక్కో గ్లాసుకు జ్యూస్‌ను బట్టి రూ.10 నుంచి రూ.40 వరకు విక్రయిస్తాం. వేసవి సీజన్‌లో ఇదే మాకు ప్రధాన ఉపాధి. రోజుకు రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకు సంపాదిస్తాం.

– రషీద్, ఫ్రూట్ జ్యూస్ విక్రయదారు

రెండు నెలల్లో రూ.లక్ష..



వేసవిలో చాలా మంది తాటి ముంజలను భలే ఇష్టంగా తింటారు. వీటి సీజన్ తక్కువ కాలం ఉంటుంది. దీంతో ఎగబడి కొంటుంటారు. దూర ప్రాంతాల నుంచి ఆటోల్లో తీసుకువచ్చి విక్రయిస్తాం. రోజంతా ఎండలోనే పని. రెండు నెలల్లో రూ.లక్ష వరకు సంపాదిస్తాం.

– హన్మంతు, చిన్నవార్వల్

ఆత్మబంధువు అంబేడ్కర్



వికారాబాద్ పట్టణంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్ తదితరులు

స్పీకర్ ప్రసాద్‌కుమార్

- వికారాబాద్‌లో భారీ కాంస్య విగ్రహం ఆవిష్కరణ
- పాల్గొన్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మండలి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కాలె యాదయ్య

అనంతగిరి: దేశంలోని కోట్లాది మంది దళిత, గిరిజన, బహుజనులు తలెత్తుకొని జీవిస్తున్నారంటే ఆ ధైర్యం పేరే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణంలోని ఎన్నెపల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన 12 అడుగుల అంబేడ్కర్ భారీ కాంస్య విగ్రహాన్ని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మండలి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు టి.రామ్మోహన్ రెడ్డి, బి.మనోహర్‌రెడ్డి, కాలె యాదయ్య, కలెక్టర్ ప్రతీక్ జైన్, ఎస్పీ నారాయణరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అంబేడ్కర్ ఒక చరిత్ర కాదు.. నేటి వాస్తవానికి ప్రతీక అన్నారు. అన్ని వర్గాల ఆత్మబంధువు అని కొనియాడారు. వికారాబాద్ పట్టణ ముఖ ద్వారంలో మహనీయుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవడం జిల్లాకే గర్వకారణమన్నారు. విద్య, ఉద్యోగాలు, రాజకీయ, సామాజికరంగాల్లో తమతమ వాటా పొందుతున్నారంటే ఆయన చలువే అన్నారు. తాను పడిన కష్టాలు.. అనుభవించిన బాధలు భవిష్యత్‌లో ఎవరూ పడరాదనే రిజర్వేషన్లు అనే బ్రహ్మాస్త్రాన్ని మనకు ఇచ్చారని పేర్కొన్నారు. ఆయన చూపిన మార్గంలో మనందరం నడిచి ఉన్నత స్థానాలు చేరుకుందామని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ ఒక కులానికో, ఒక మతానికో చెందిన వ్యక్తి కాదని..దేశ ప్రజల ఆస్తి అని అన్నారు. ఆయన ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ పాలన సాగుతోందని పేర్కొన్నారు.

మహోన్నత వ్యక్తి అంబేడ్కర్: ఎంపీ కొండా

అనంతరం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. దేశానికి దిక్సూచి చూపిన మహోన్నత వ్యక్తి అంబేడ్కర్ అన్నారు. దేశ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని రాజ్యాంగాన్ని రచించారని స్పష్టం చేశారు. మండలి చీఫ్‌విప్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ.. బాబా సాహెబ్‌ను యువత స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేసుకోవడం అంటే వారి త్యాగం, సేవలను ముందుతరాలు తెలియజేడానికేనని అన్నారు. అనంతరం ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఖాసీం మాట్లాడుతూ.. సమాజంలోని అసమానతలను రూపుమాపేందుకు తన జీవితకాలం పోరాడిన మహా వ్యక్తి అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆనంద్, ఆర్థిక కమిటీ సభ్యుడు రమేష్ మహారాజ్, డీసీసీబీ డైరెక్టర్ కిషన్ నాయక్, ఆర్టీఏ సభ్యుడు జాఫర్, దిశ కమిటీ సభ్యుడు వడ్ల నందు, మున్సిపల్ మాజీ చైర్మన్లు సత్యనారాయణ, చిగుళ్లపల్లి మంజుల, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



అంబేడ్కర్ కాంస్య విగ్రహం

రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేద్దాం

రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. బుధవారం వికారాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన సంవిధాన్ బచావో పాదయాత్రలో భాగంగా ముందుగా అంబేడ్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సత్యభారతి గార్డెన్ వరకు ర్యాలీ తీశారు. తదనంతరం కాంగ్రెస్ పార్టీ సంస్థాగత, నిర్మాణ, సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంతో ముందుచూపుతో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారని పేర్కొన్నారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మాట్లాడారు. పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఈ ప్రాంతానికి తీరని అన్యాయం జరిగిందన్నారు. జిల్లాకు సాగు నీరు ఇవ్వకుండా, అభివృద్ధి కాకుండా చేశారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో జిల్లాను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు రమేష్ మహరాజ్, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, పీసీసీ అబ్జర్వర్లు వినోద్‌కుమార్, నరేందర్, యూత్ కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, పీసీసీ జనరల్ సెక్రటరీ ధారాసింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



ర్యాలీలో ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, పార్టీ శ్రేణులు

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

- యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి

చేవెళ్ల: కాంగ్రెస్‌పార్టీ వ్యవస్థాపక పునఃనిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర యూత్ అధ్యక్షుడు, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. మున్సిపల్ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం చేవెళ్ల నియోజకవర్గం ఇన్‌చార్జి పామెన భీంభరత్ అధ్యక్షతన జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంపై విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి శివసేనారెడ్డితోపాటు జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు కలిసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇది పార్టీ ఇచ్చిన మంచి అవకాశంగా తీసుకోవాలని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలతో కలిసిపోయేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. కాగా, నియోజకవర్గంలో పార్టీలో విభేదాలు, సమస్యలను నాయకులు, కార్యకర్తలు సమావేశంలో బయట పెట్టారు. రెండు వర్గాల కారణంగా పార్టీ చేపట్టే కార్యక్రమాలను సరిగా చేయలేకపోతున్నామని, సమన్వయం చేసేవారు లేకుండాపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన నేతలు విషయాన్ని అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ రేణుకాదేవి

ప్రభుత్వ పాఠశాలల్లో క్వాలిటీ విద్య

డీఈఓ రేణుకాదేవి

దోమ: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్వాలిటీ విద్యను అందిస్తున్నామని డీఈఓ రేణుకాదేవి అన్నారు. బుధవారం మండలంలోని బొంపల్లి ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న ఏఐ, సమ్మర్ క్యాంపులను ఎంఈఓ వెంకట్‌తో కలిసి సందర్శించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా దుస్తులు, భోజనం, డిజిటల్ బోధన అందిస్తున్నామని చెప్పారు. ఏఐ బోధనలో బొంపల్లి ప్రాథమిక పాఠశాలకు ఇండో గ్లోబల్ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ఇందుకు కృషి చేసిన హెచ్ఎం షఫీని అభినందించారు. అనంతరం ఏఐ తరగతులు పూర్తి చేసుకున్న విద్యార్థుల తోపాటు పది ఫలితాల్లో మండల స్థాయిలో సత్తా చాటిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు లాల్యానాయక్, అమర్నాథ్, ఆంజనేయులు, హెచ్ఎంలు రూప్‌సింగ్, శ్రీవిద్య, బాబుచాంద్, మల్లేశం, ఏపీఎం సురేశ్, స్కూల్ చైర్‌పర్సన్ నసీమాబేగం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాములు, స్కూల్ మాజీ చైర్మన్ శ్రీనివాస్, వార్డు మాజీ సభ్యుడు చంద్రశేఖర్ ముదిరాజ్, కోఆప్షన్ మాజీ సభ్యుడు పవన్ యాదవ్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకట్ రెడ్డి, జూనియర్ కళాశాల అధ్యాపకుడు శ్రీధర్, ఉపాధ్యాయురాలు స్వప్న పాల్గొన్నారు.

కరెంట్ పోనివ్వం

- డిమాండ్ ఎంతున్నా నిరంతర సరఫరా
- లోడ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను ఇప్పటికే గుర్తించాం
- ఫీడర్లు, పీటీఆర్‌లు, డీటీఆర్‌ల సామర్థ్యం పెంచాం
- కొత్తగా మరిన్ని సబ్ స్టేషన్లు నిర్మించబోతున్నాం
- నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిని ఉపేక్షించం
- 'సాక్షి'తో టీజీ ఎస్పీడీసీఎల్ రంగారెడ్డి జోన్ సీజీఎం పాండ్యా నాయక్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'ఐటీ సర్కిల్లో విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరుగుతోంది. అధిక లోడు కారణంగా ఒత్తిడికి గురవుతున్న సబ్‌స్టేషన్లను గుర్తించాం. పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని 8 ఎంవీఏ నుంచి 12.5 ఎంవీఏకు పెంచాం. ఫీడర్లను అనుసంధానిచ్చాం. కొత్తగా అనేక డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంతో పాటు వాటి సామర్థ్యాన్ని పెంచాం.ఐటీ జోన్‌లో రెప్పపాటు కూడా కరెంట్ పోకుండా కాపాలా కాస్తున్నాం'అని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ రంగారెడ్డి జోన్ సీజీఎం పాండ్యా నాయక్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. నమోదవుతున్న విద్యుత్ డిమాండ్, చేపట్టిన ప్రత్యామ్నాయ చర్యలను వివరించారు. ఆయన మాటల్లోనే..

విద్యుత్ గ్రోత్ రేట్ ఇక్కడే అధికం

2023 ఏప్రిల్‌తో పోలిస్తే 2024 ఏప్రిల్‌లో ఇతర జోన్లతో పోలిస్తే రంగారెడ్డి జోన్‌లోనే ఎక్కువ విద్యుత్ గ్రోత్‌రేటు నమోదైంది. మెట్రో జోన్‌లో 13.86 శాతం విద్యుత్ వృద్ధిరేటు నమోదు కాగా, మేడ్చల్ జోన్‌లో 16.31 శాతం నమోదైంది. రంగారెడ్డి జోన్‌లో ఏకంగా 17.77 శాతం నమోదైంది. గచ్చిబౌలి, ఇబ్రహీంబాగ్, కొండాపూర్ డివిజన్లలో 31.75 శాతం వృద్ధి రేటు కన్పించింది. మణికొండ, అయ్యప్ప సొసైటీ, కోకాపేట్, నార్సింగి, గచ్చిబౌలి, మణికొండ, సన్‌సిటీ, కిస్మత్‌పూర్, ఇబ్రహీంబాగ్, తుక్కుగూడ, శంషాబాద్‌లో అనూహ్య పెరుగుదల కన్పించింది. భవిష్యత్తులో వచ్చే ఒత్తిడిని తట్టుకునేలా సరఫరా వ్యవస్థను మెరుగుపరుస్తున్నాం. రాజేంద్రనగర్ సర్కిల్‌లో 13, సైబర్ సిటీ సర్కిల్‌లో ఆరు, సరూర్‌నగర్ సర్కిల్‌లో ఐదు, వికారాబాద్‌లో పది చొప్పున కొత్త సబ్ స్టేషన్లు నిర్మించబోతున్నాం.

సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా..

సైబర్‌సిటీ సర్కిల్‌లో ఒత్తిడికి గురవుతున్న 128 (11కేవీ సహా నాలుగు 33 కేవీ ఫీడర్లను పునరుద్ధరించాం. సబ్‌స్టేషన్లలోని 25 పీటీఆర్‌ల సామర్థ్యాన్ని పెంచాం. కొత్తగా మరో 232 డీటీఆర్‌లను ఏర్పాటు చేశాం. రాజేంద్రనగర్ సర్కిల్‌లో 67(11 కేవీ), 09(33కేవీ) ఫీడర్లు సహా 24 పీటీఆర్‌ల సామర్థ్యం పెంచాం. ఇక్కడ కొత్తగా మరో 171 డీటీఆర్‌లను ఏర్పాటు చేశాం. సరూర్ నగర్ సర్కిల్ పరిధిలో 49(11కేవీ) సహా ఏడు 33 కేవీ ఫీడర్లతో పాటు 23 పీటీఆర్‌ల సామర్థ్యం పెంచాం. కొత్తగా మరో 309 డీటీఆర్‌లను ఏర్పాటు చేశాం. వికారాబాద్ సర్కిల్ పరిధిలో పది 11 కేవీ, ఒక 33 కేవీ లైన్లను అనుసంధానించాం. తొమ్మిది పీటీఆర్‌లతో పాటు మరో 234 డీటీఆర్‌లను ఏర్పాటు చేశాం.

డిమాండ్ ఎంతొచ్చినా తగ్గేదే లేదు

నగరానికి ఆనుకుని ఉన్న ఈ జిల్లాలో కొత్తగా అనేక నిర్మాణాలు వస్తున్నాయి. ఐటీ అనుబంధ పరిశ్రమలతో పాటు హోటళ్లు, ఇతర వాణిజ్య సంస్థలు ఏర్పడుతున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా విద్యుత్ డిమాండ్ నమోదవుతోంది. ఇప్పటికే ఉన్న సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పెంచడంతో పాటు కొత్తగా మరికొన్ని సబ్‌స్టేషన్లకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. 2030లో రాబోయే డిమాండ్‌ను ఇప్పుడే అంచనా వేసుకుని ఆ మేరకు లైన్ల విస్తరణ, పీటీఆర్‌ల సామర్థ్యం పెంపు వంటి చర్యలు చేపట్టాం. అంచనాలకు మించి డిమాండ్ వచ్చినా సమర్థవంతంగా సరఫరా చేస్తాం. క్షేత్రస్థాయిలో కొంత మంది సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో పాటు అడ్డదారులు తొక్కుతున్నట్లు తరచూ ఫిర్యాదులు అందుతున్నాయి. లైన్ల మంజూరు, మీటర్ల జారీలో అక్రమ వసూళ్లకు పాల్పడుతూ సంస్థకు చెడ్డపేరు తెచ్చే వాళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోం. అలాంటి వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తాం.

ఆర్ఆర్‌జోన్‌లో ఈనెలలో విద్యుత్ డిమాండ్

తేదీ	మెగావాట్లు	మిలియన్ యూనిట్లు
01	1,591	39.02
02	1,828	39.28
03	1,548	37.17
04	1,397	35.54
05	1,597	38.15

క్లుప్తంగా

ప్రాణం తీసిన ఈత సరదా

నీట మునిగి మృతి చెందిన తొమ్మిదేళ్ల బాలిక


భవ్యశ్రీ మృతదేహం

బొంరాస్‌పేట: చిన్నారులతో కలిసి ఈతకు వెళ్లిన తొమ్మిదేళ్ల బాలిక నీట మునిగి మృతి చెందిది. ఈ హృదయ విదారక ఘటన మండల పరిధిలోని రేగడిమైలారం పటేల్‌చెరువు తండాలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన బలిజ ప్రవీణ్, మమత పెద్ద కూతురు భవ్యశ్రీ(9) కొడంగల్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో మూడో తరగతి పూర్తి చేసుకుంది. మధ్యాహ్నం గ్రామంలోని పలువురు చిన్నారులు వేసవి విడిదిగా పటేల్ చెరువు వద్దకు వెళ్లారు. కొందరు చిన్నారులు నీట మునగడంతో తోటి వారు గమనించి వెంటనే బయటకు లాక్కొచ్చారు. భవ్యశ్రీ ఎక్కువ లోతుకు వెళ్లి నీట మునగడంతో చిన్నారులు అరుపులు కేకలు వేశారు. సమీపంలోని గొర్రెల కాపరులు గమనించి వెంటనే చెరువులోకి దిగి గల్లెంతైన బాలికను వెతికి బయటకు తీశారు. అప్పటికే మృతి చెందడంతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు.

స్కూటీని ఢీకొట్టిన డీసీఎం

ఒకరి మృతి, మరొకరికి స్వల్పగాయాలు


భాను(ఫైల్)

పరిగి: ఆస్పత్రిలో తల్లికి చికిత్స చేయించుకుని తీసుకెళ్తున్న కుమారుడు మృత్యు ఒడికి చేరాడు. ఈ దుర్ఘటన చిట్యాల గేట్ సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సంతోశ్ కుమార్ తెలిపిన ప్రకారం.. కొందర్గు మండల కేంద్రానికి చెందిన బోయ మల్లమ్మ ఆమె కుమారుడు భాను కలిసి స్కూటీపై ఉదయం చికిత్స నిమిత్తం పరిగి ఆస్పత్రికి వచ్చారు. తిరిగి వెళ్తుండగా చిట్యాల గేట్ సమీపంలో షాద్‌నగర్ నుంచి పరిగి వైపు ప్రయాణిస్తున్న ఓ డీసీఎం ఎదురుగా వచ్చి వీరి స్కూటీని ఢీకొట్టింది. దీంతో భాను తలకు తీవ్రగాయాలై అక్కడికక్కమే మృతి చెందగా తల్లికి స్వల్పగాయాలయ్యాయి. మల్లమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దారి కబ్జా చేసి నిర్మాణం

చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

మీర్‌పేట: దారిని కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాన్ని తొలగించాలని నందనవనం వాంబే కాలనీవాసులు మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ నాగరాజుకు మంగళవారం రాత్రి ఫిర్యాదు చేశారు. వాంబే కాలనీలో స్థానికంగా ఉండే ఓ వ్యక్తి 24 ఇళ్లకు సంబంధించి వెళ్లే 300 గజాల దారిని ఆక్రమించి ప్రహరీ, గదులు నిర్మిస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని కాలనీవాసులు ఫిర్యాదులో పేర్కొన్నారు. వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన ఇంటి నిర్మాణంపై జీహెచ్ఎంసీ అధికారులకు చెప్పామని సీఐ పేర్కొన్నారు.

కారు అదుపుతప్పి ఆర్‌ఐకి గాయాలు


ప్రమాదంలో గాయపడిన శ్రీనివాస్‌రెడ్డితో మాట్లాడుతున్న తహసీల్దార్ జగదీశ్వర్

కొందుర్గు: కారు అదుపు తప్పి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విధి నిర్వహణలో భాగంగా బుధవారం ఉదయం ముట్పూర్‌లో నిర్వహించనున్న రెవెన్యూ సదస్సుకు హాజరయ్యేందుకు జిల్లేడ్ చౌదరిగూడ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తన కారులో ఉమ్మెంత్యాల నుంచి ముట్పూర్ వెళ్తుండగా.. రేగడిచిల్కమర్రి సమీపంలో వాహనం అదుపు తప్పింది. పక్కనే ఉన్న బీరప్ప ఆలయానికి చెందిన బేస్మెట్ గోడను ఢీకొట్టింది. బెలూన్స్ తెరుకోవడంతో శ్రీనివాస్‌రెడ్డి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ జగదీశ్వర్, సీనియర్ అసిస్టెంట్ మహేందర్‌గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని ఆస్పత్రికి తరలించారు.

సలామ్.. హస్నాబాద్

దేశ రక్షణ అనగానే ముందుగా గుర్తుకు వచ్చేది ఆర్మీనే. కుటుంబాలకు దూరంగా ఉంటూ భరతభూమికి వారు చేస్తున్న సేవ వెలకట్టలేనిది. రేయింబవళ్లు శత్రు మూకల బుల్లెట్లు, బాంబుల మోతల మధ్య నిత్యం పోరాటం చేసే సైనికులే మన ధైర్యం. ఆ సైన్యంలో దాదాపుగా వంద మందికి పైగా హస్నాబాద్ వాసులు విధులు నిర్వహిస్తున్నారు.

- గ్రామం నుంచి ఆర్మీలో వంద మందికి పైగా సైనికులు
- వేర్వేరు రాష్ట్రాల్లో విధులు నిర్వర్తిస్తున్న వారిని యుద్ధభూమికి తరలింపు
- ఆనందంగా ఉందంటూ ఆత్మీయులకు ధైర్యం చెబుతున్న జవాన్లు


1971 యుద్ధ సమయంలో అధికారి హోదాలో ఇంతియాజ్ అలీ (వృత్తంలో)


జమ్మూకశ్మీర్‌లో విధులు నిర్వహిస్తున్న సైనికుడు రమేశ్

దుద్యాల్: యువత సరిహద్దులో సేవ చేసేలక్ష్యంతో ఆర్మీలో చేరేందుకు ముందుకు వస్తున్నారు. మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామం నుంచి వంద మందికి పైగా దేశ రక్షణలో సైనికులుగా చేరారు. ప్రతీ సెలక్షన్ నుంచి ఇద్దరి నుంచి ఐదుగురు వరకు సైన్యంలో చేరడం ఆనాయితీగా మారింది. 70 ఏళ్ల క్రితం ప్రారంభమైన చేరికలు నేటికీ కొనసాగుతూ దేశ సేవలో తరిస్తున్నారు. ప్రతీ ఏడాది పది మంది పదవీ విరమణ పొందుతుంటే మరో పది మంది సైన్యంలో చేరుతుంటారు. ఒక్కో ఇంట్లో ఇద్దరు, ముగ్గురు చొప్పున సైన్యంలో విధులు నిర్వహిస్తున్న వారు వంద మందికి పైగా ఉన్నారు.

రక్తం ఉరకలేస్తోంది

ప్రస్తుతం భారత్–పాకిస్తాన్ మధ్య యుద్ధ వాతావరణం ప్రారంభమైంది. దీంతో వివిధ రాష్ట్రాల్లో విధులు నిర్వహిస్తున్న గ్రామానికి చెందిన దాదాపు 50 మంది వరకు సైనికులను జమ్మూకశ్మీర్ ప్రాంతానికి తరలించినట్లు సమాచారం. కొన్నేళ్లుగా సాధారణ విధులు నిర్వహించిన తమకు ప్రస్తుతం మధురానుభూతి కల్గుతోందని కుటుంబ సభ్యులతో అభిప్రాయాలను పంచుకుంటున్నారు. శత్రు దేశం పాకిస్తాన్‌తో యుద్ధం అంటే రక్తం ఉరకలేస్తుందంటున్నారు. హైదరాబాద్, నాసిక్, బెంగళూర్, తమిళనాడు, ఉత్తర్ ప్రదేశ్ వంటి ప్రధాన నగరాల్లో విధులు నిర్వహిస్తున్న వారిని యుద్ధ పరిసర ప్రాంతాలకు తరలించినట్లు అందులో హస్నాబాద్‌కు చెందిన వారు సైతం ఉన్నారని సైనికులు చెబుతున్నారు. ప్రాణభయం లేకుండా దేశసేవకు సిద్ధంగా ఉన్నామని.. ఉగ్రవాదులను అంతం చేయడానికి మంచి అవకాశం వచ్చిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కార్గిల్ యుద్ధంలో నేను సైతం

ఇంతియాజ్ అలీ 1971లో జరిగిన భారత్–పాకిస్తాన్ యుద్ధంలో పాల్గొన్నారు. ఈ యుద్ధ సమయంలో పాక్–బంగ్లా దేశాలు కొన్ని ప్రాంతాలు విడిపోయాయని ఆయన చెప్పారు. భారత్ నుంచి ప్రత్యక్ష యుద్ధంలో పాల్గొనడం ఆత్మ సంతృప్తినిచ్చిందన్నారు. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలోనూ పాలుపంచుకున్నట్లు గుర్తు చేశారు. ప్రస్తుత 'ఆపరేషన్ సిందూర్'లో పాల్గొనే అవకాశం హస్నాబాద్‌కు చెందిన సైనికులకు దక్కిందని ఆయన ఆనందం వ్యక్తం చేస్తూ అభినందిస్తున్నారు.

గర్వంగా ఉంది



భారత్–పాక్ మధ్య జరుగుతున్న యుద్ధ విధుల్లో ఉన్నా. ప్రస్తుతం చైనా సరిహద్దులోని లడక్ ప్రాంతంలో భద్రత బలగాల్లో ఉన్నాను. ఇన్నాళ్ల విధుల కంటే ఇప్పుడే సంతృప్తిగా ఉంది. ప్రాణాలకు తెగించి ప్రత్యర్థిపై యుద్ధం చేయడమే లక్ష్యం. దేశసేవలో పాల్గొంటున్నందుకు గర్వంగా ఉంది.

– జి.ఆశప్ప, నాయక్ సుబేదార్

పిలుపు వస్తే పరుగెత్తుతాం



ప్రస్తుతం భారత్–మధ్య యుద్ధ వాతావరణం నెలకొంది. మన దేశం శత్రు మూకపై దాడులు ప్రారంభించింది. ఉగ్రవాదులను పూర్తిగా మట్టుబెట్టేందుకు భారత సైన్యం తలమునకలైంది. మాజీ సైనికులకు పిలుపువస్తే వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నా. యుద్ధం చేయాలనే ఆసక్తితో ఉన్నాం.

– బసప్ప, మాజీ సైనికుడు, హస్నాబాద్

సమస్యలు తెలుసుకోని సదస్సులెందుకు?

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు


అల్లాపూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సు

ధారూరు: ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములను ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారంటూ ఫిర్యాదు చేసేందుకు వచ్చిన రైతులపై ఓ డిప్యూటీ తహసీల్దార్ స్వరం పెంచాడు. ఈ ఘటన మండల పరిధిలోని అల్లాపూర్‌లో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో చోటు చేసుకుంది. వివరాలు.. అల్లాపూర్‌లో 45 మంది పేదలకు ప్రభుత్వం అసైన్డ్ పట్టాలిచ్చింది. ఇటీవల ఫారెస్ట్ అధికారులు ఈ భూములు తమవని లాక్కొన్నారని ఫిర్యాదు చేశారు. సదస్సుకు హాజరైన అధికారుల బృందంలోని పరిగి డిప్యూటీ తహసీల్దార్ అనిల్ స్పందిస్తూ గత ప్రభుత్వ హయాంలో ఎందుకు చేయించుకోలేదు.. ఫారెస్ట్‌కు మాకేం సంబంధం అంటూ బదులిచ్చాడు. దీంతో రైతులు అప్పుడు, ఇప్పుడు చేయాల్సింది అధికారులే కదా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 79 ఏళ్ల క్రితం తమ పెద్దలు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసుకున్నందుకు గాను రెండు ఎకరాల చొప్పున భూములు ఇచ్చారని.. వారసులమే అనుభవిస్తుంటే ఎలా లాక్కుంటారని ప్రశ్నించారు. మరో చోట భూములు ఇవ్వాలని అభ్యర్థించారు. రైతుల అభ్యర్థన మేరకు సర్వేయర్ వెళ్లి భూములను పరిశీలించారు. రైతులు ఫిర్యాదు చేసేందుకు దరఖాస్తు రాస్తుండగా అవసరం లేదంటూ డిప్యూటీ తహసీల్దార్ అక్కడ నుంచి వెళ్లిపోయారని రైతులు వాపోతున్నారు. సమస్యలు తెలుసుకోని సదస్సులు ఎందుకంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

గన్‌మెన్‌ను తోసేసిన కాంగ్రెస్ కార్యకర్తలు

- కిందపడిన అంగరక్షకుడు
- సామాజిక మాధ్యమాల్లో వైరల్


తోపులాటలో కిందపడిన మంత్రి గన్‌మెన్

నందిగామ: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బుధవారం పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి విచ్చేశారు. నందిగామ జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో నాట్కో ట్రస్టు ఆర్థిక సహకారంతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించేందుకు విచ్చేసిన ఆయన పాఠశాల గేటు నుంచి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌తో కలిసి నడుస్తున్నారు. ఈ క్రమంలో మాజీ సర్పంచ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొమ్ము కృష్ణ తమ అనుచరులతో మంత్రిని దగ్గరనుంచి అనుసరించే క్రమంలో గన్‌మెన్ కాంగ్రెస్ నాయకులతో పాటు, కొమ్ము కృష్ణను సైతం పక్కకు తోశాడు. దీంతో ఆగ్రహించిన కార్యకర్తలు గన్‌మెన్‌ను పక్కకు నెట్టేయడంతో పడిపోయాడు. దీంతో మంత్రి శ్రీధర్‌బాబు కృష్ణపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఇంతలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కల్పించుకొని వారిని సముదాయించాడు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఈ విషయమై కొమ్ము కృష్ణను వివరణ కోరగా తాను గన్‌మెన్‌పై దాడి చేయలేదని ఆయనే నన్ను పక్కకు నెట్టి వేశారని తన తప్పేమీలేదని చెప్పారు.

భూ భారతిలోనైనా పరిష్కరించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు అంజయ్య కుటుంబ సభ్యులు, నాయకులు

కద్తాల్: కంప్యూటర్ ఆపరేటర్ చేసిన తప్పిదం కారణంగా తన భూమి.. ధరణి పోర్టల్ మరో వ్యక్తి పేరిట నమోదైందని ఓ రైతు ఆవేదన వ్యక్తంచేశాడు. కనీసం భూభారతిలో నైనా సమస్యను పరిష్కరించాలని కోరాడు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ ముంతాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కద్తాల్‌లోని సర్వే నంబర్లు 72/ఇ, 846, 816,817,321/24లలో తనకు మొత్తం 2.29 ఎకరాల భూమి ఉందని, అరవై ఏళ్లుగా ఇందులో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాని తెలిపారు. కంప్యూటర్ ఆపరేటర్ తప్పిదం కారణంగా ఈ భూమి అన్మాస్‌పల్లికి చెందిన బాచిరెడ్డి రంగారెడ్డి పేరిట తప్పుగా నమోదైందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేందర్, నాయకులు రాజేశ్, శివ, కుటుంబ సభ్యులు బాలరాజు నిరంజనమ్మ, కృష్ణ, సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూ తగాదాలో ఇరువర్గాల ఘర్షణ

- పలువురికి గాయాలు
- కేసు నమోదు


మీసాలతండాలో ఘర్షణలో తీవ్రంగా గాయపడిన వ్యక్తులు

యాచారం: మండల పరిధిలోని మీసాలతండాలో భూ తగాదా విషయమై రెండు కుటుంబాల మధ్య మంగళవారం సాయంత్రం తీవ్ర ఘర్షణ జరిగింది. ఓ వర్గానికి చెందిన కుటుంబం వారు కర్రలు, ఇనుప రాడ్లతో మరో వర్గంపై దాడికి పాల్పడ్డారు. ఈ సంఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. మీసాలతండా పరిధిలోని సర్వేనంబరు 44లో ఎకరా పట్టా భూమికి సంబంధించి నేనావత్ సోమ్లు, నేనావత్ కేవ్లనాయక్ వారసుల మధ్య కొన్నేళ్లుగా వివాదం సాగుతోంది. ఈక్రమంలో మంగళవారం సాయంత్రం ఇరు కుటుంబాల వారు కర్రలు, ఇనుప రాడ్లతో దాడి చేసుకున్నారు. ఈ ఘర్షణలో రాకేష్, పవన్ రాంజీకి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను మొదట యాచారం ప్రభుత్వ ఆస్పత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం నగరానికి తరలించారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాచారం సీఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు.

'ఫలితం' ఏముంది!

ఉన్నత చదువులు చదివి అనుభవజ్ఞులైన అధ్యాపకులుండే ప్రభుత్వ కళాశాలల్లో ఫలితాలు నిరాశ కలిగిస్తున్నాయి. దీంతో విద్యార్థుల సంఖ్య ఏటేటా తగ్గుతోంది. ప్రభుత్వ కళాశాలల్లో వసతులు, మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామంటూ గొప్పలు చెప్పే ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు ఎటువంటి దిద్దుబాటు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

- ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 40 శాతం దాటని ఉత్తీర్ణత
- అంతకంతకూ పడిపోతున్న విద్యార్థుల సంఖ్య
- దిద్దుబాటు చర్యలు తీసుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న మండలవాసులు


నవాబుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల

నవాబుపేట: నవాబుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల పరిస్థితి రోజురోజుకు దయనీయంగా మారుతోంది. ప్రతీ ఏడాది విద్యార్థుల సంఖ్య తగ్గడంతో పాటు ఇంటర్ ఫలితాలు సైతం పడిపోతున్నాయి. దీంతో కళాశాల మూతపడుతోందేమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సర విద్యార్థుల మొత్తం సంఖ్య 24 మంది మాత్రమే. పది మంది ప్రథమ సంవత్సర విద్యార్థులు పరీక్షకు హాజరవగా కేవలం నలుగురు మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. 14 మంది ద్వితీయ సంవత్సర నుంచి పరీక్ష రాయగా కేవలం ఏడుగురు పాసవ్వగా మరో ఏడుగురు ఫెయిల్ అయ్యారు.

11 మంది అధ్యాపకులు 11 మంది ఉత్తీర్ణత

ఈ ఏడాది కళాశాలలో మొత్తం 24 మంది విద్యార్థులుండగా వీరికి 11 మంది టీచింగ్, ముగ్గురు నాన్ టీచింగ్ స్టాఫ్ ఉన్నారు. ఫలితాలు మాత్రం అధ్యాపకుల సంఖ్యకు మించ లేదు. 24 మంది విద్యార్థుల్లో కేవలం 11 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించడంతో కళాశాల క్రమంగా మూతబడుతుందేమోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు చదవడం లేదా..? అధ్యాపకుల బోధన సరిగా లేదా అనేది అధికారులే తేల్చి దిద్దుబాటు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఇంటర్ ఫలితాల్లో 40 శాతం మించకపోవడంతో తల్లిదండ్రులు సైతం ఫీజులు చెల్లింపులకు ఇబ్బంది అయినా ప్రైవేటునే ఆశ్రయిస్తున్నారు.

విద్యా సంవత్సరం	ప్రథమ	పాస్	ఫెయిల్	ద్వితీయ	పాస్	ఫెయిల్
2021-22	85	26	59	73	27	46
2022-23	52	5	47	66	25	41
2023-24	22	4	18	38	9	29
2024-2510	4	6	14	7	7	

తల్లిదండ్రులు, విద్యార్థులు సహకరించాలి

కళాశాలలో విద్యార్థుల సంఖ్య తగ్గడానికి కారణం హాస్టల్ సదుపాయం లేకపోవడం. తల్లిదండ్రులు హాస్టల్ వసతి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కళాశాలకు వెళ్తున్నామని బయలుదేరుతున్న విద్యార్థులు తరగతులకు హాజరవడం లేదు. ఇక నుంచి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం. ఫలితాలు మెరుగుపరిచేందుకు కృషి చేస్తాం. తల్లిదండ్రులు, విద్యార్థులు సహకరిస్తే మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తాం.

– సురేశ్వరస్వామి ప్రిన్సిపాల్, నవాబుపేట జీజేసీ

వీడిన వృద్ధ దంపతుల హత్య కేసు మిస్టరీ

- జైలు నుంచి విడుదలైన 8 రోజుల్లోనే మరో ఘాతుకం
- నిందితుడిని పట్టుకున్న అల్వాల్ పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి

కుత్బుల్లాపూర్: వృద్ధ దంపతుల హత్య కేసు మిస్టరీని అల్వాల్ పోలీసులు ఛేదించారు. పాత నేరస్తుడే డబ్బు కోసం కర్రతో కొట్టి చంపినట్లు తేల్చి అరెస్టు చేశారు. పేట్‌బషీరాబాద్‌లో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, అడిషనల్ డీసీపీ పురుషోత్తం, ఏసీపీ రాములు, సీఐ రాహుల్ దేవ్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ తిమ్మప్పలతో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బొల్లారం ప్రాంతానికి చెందిన చింతకింద అనిల్ (37) ఈ నెల 4న అల్వాల్ ప్రాంతంలోని సూర్య నగర్ కాలనీలో రేకుల రూములో ఉండే కనకయ్య (70), రాజమ్మ (65)ల ఇంట్లోకి అర్ధరాత్రి ప్రవేశించి వారిపై సెంట్రింగ్ కర్రతో దాడి చేయడంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన తీవ్ర సంచలనం రేపింది. అల్వాల్ పోలీసులు సవాల్ గా తీసుకొని ఏకంగా 100 సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించి నిందితుడిని పట్టుకున్నారు. అతని వద్ద నుండి రెండు సెల్ ఫోన్లు, కొంత బంగారం, సిల్వర్‌తో పాటు 20 వేల రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు.

పలు కేసుల్లో రిమాండ్

నిందితుడు అనిల్ దొంగతనం తదితర కేసుల్లో అరెస్టయి..ఏప్రిల్ 26న చంచల్‌గూడ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యాడు. తిరిగి వారం రోజులకే మళ్లీ దొంగతనాలనే వృత్తిగా ఎంచుకున్నాడు. ఈ క్రమంలోనే వృద్ధ దంపతుల ఇంట్లోకి ప్రవేశించి దాడి చేసి బంగారు పుస్తెల తాడు, వెండి పట్టా గొలుసు, కొంత నగదు ఎత్తుకెళ్లాడు. ఈ కేసు తీవ్రంగా పరిగణించిన పోలీసులు సీసీ కెమెరాలు జల్లెడ పట్టగా నిందితుడి ఆనవాళ్లు లభించాయి. అంతేకాకుండా వృద్ధ దంపతులపై దాడి చేసి వారి వద్ద ఉన్న రెండు సెల్ ఫోన్లను తీసుకెళ్లగా వాటి సిగ్నల్ ఆధారంగా పోలీసులు చాకచక్యంగా నిందితుడిని అదుపులో తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఐటీ ఉద్యోగి దుర్మరణం


దీపక్ (ఫైల్)

మాదాపూర్: బైకుపై అతి వేగంగా వెళ్తూ..అదుపు తప్పి వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టడంతో ఓ ఐటీ దుర్మరణం పాలయ్యాడు. మాదాపూర్ ఇన్స్‌పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం..వరంగల్ జిల్లా పరకాలకు చెందిన మోకిడి దీపక్ (29) మాదాపూర్‌లోని ఓ కంపెనీలో ఐటీ ఉద్యోగిగా పని చేస్తూ మల్లంపేట్ కేవీఆర్ వ్యాలీలో నివాసముంటున్నాడు. బుధవారం తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో దీపక్ బైకుపై పర్వత్‌నగర్ సిగ్నల్ వైపు నుంచి హైటెక్‌సిటీ వైపు వెళ్తుండగా..అదే సమయంలో హైటెక్‌సిటీ నుంచి వస్తున్న వాటర్ ట్యాంకర్ వాహనం జంక్షన్ వద్ద టర్నింగ్ తీసుకుంటుండగా..దీపక్ బైకు వేగంగా ఢీకొట్టింది. తల, శరీరభాగాలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రేడింగ్ పేరుతో భారీ మొత్తం స్వాహా

- ఆన్‌లైన్ ద్వారా ఎర వేసిన సైబర్ నేరగాళ్లు
- తొలుత లాభాలు చూపించి ఆపై టోకరా
- సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో కేసు నమోదు

సాక్షి, సిటీబ్యూరో: సామ్కో ఇన్వెస్టిమెంట్స్ అండ్ సెక్యూరిటీ పేరుతో నగర వ్యాపారికి ఎర వేసిన సైబర్ నేరగాళ్లు ట్రేడింగ్ పేరుతో భారీ మొత్తం కాజేశారు. దీనిపై బాధితుడు బుధవారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. నగర వ్యాపారిని గత ఏడాది డిసెంబర్‌లో కొందరు వ్యక్తులు ఆన్‌లైన్‌లో సంప్రదించారు. తాము సామ్కో ఇన్వెస్టిమెంట్స్ అండ్ సెక్యూరిటీ ప్రతినిధులుగా చెప్పుకున్నారు. తమ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, దాని ద్వారా ట్రేడింగ్ చేయాలని కోరారు. అధిక లాభాలు పొందడానికి అవసరమైన సలహాలు, సూచలు ఇస్తామని నమ్మించారు. వీరి మాటలు నమ్మిన బాధితుడు ఆ యాప్ డౌన్‌లోడ్ చేసుకున్నాడు. ట్రేడింగ్ చేయగా లాభాలు వచ్చాయి. ఆ మొత్తాలు విత్‌డ్రా చేసుకోవడానికి అవకాశం ఉంది. దీంతో బాధితుడు వివిధ దఫాల్లో రూ.68.58 లక్షలు పెట్టుబడి పెట్టారు. సామ్కో ఇన్వెస్టిమెంట్స్ అండ్ సెక్యూరిటీకి చెందినదిగా చెప్పిన యాప్‌లో రూ.50.88 లక్షలు లాభం వచ్చినట్లు కనిపించింది. ఆ మొత్తం డ్రా చేసుకోవడానికి ప్రయత్నించగా సాధ్యం కాలేదు. దీనికోసం సర్వీసు ఫీజుగా 20 శాతం చెల్లించాలని నేరగాళ్లు చెప్పడంతో వ్యాపారి అలానే చేశాడు. ఆపై నిధుల విత్‌డ్రాకు లిఫ్ట్ రిస్క్ కంట్రోల్ ఎత్తివేయాల్సి ఉందని, దీనికోసం మరో 6 శాతం చెల్లించాలని చెప్పారు. దీంతో అనుమానం వచ్చిన బాధితుడు సామ్కో ఇన్వెస్టిమెంట్స్ అండ్ సెక్యూరిటీ సంస్థను నేరుగా వెళ్లి సంప్రదించారు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్‌లో సంప్రదించిన వారికి, ఆ యాప్‌కు తమతో సంబంధం లేదని చెప్పారు. దీనిపై సైబర్ నేరగాళ్లను నిలదీయంగా స్పందన లేకుండాపోయింది. యాప్ సైతం పని చేయడం మానేసింది. ఇలా తాను మోసపోయినట్లు తెలుసుకున్న బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించడంతో కేసు నమోదైంది.

క్రికెట్ బెట్టింగ్ నిర్వాహకుల అరెస్టు

జగద్గిరిగుట్ట: క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఘటన జగద్గిరిగుట్ట ఠాణా పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ నరసింహ ప్రకారం.. ఏలూరుకు చెందిన నరసింహారాజు, నాగేశ్వరరావు స్నేహితులు. వీరు ఐపీఎల్ మొదలైన నాటి నుంచి గాజులరామారం, మహదేవపురంలో రూమ్ అద్దెకు తీసుకొని క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు బుధవారం వీరు ఉన్న ఇంటిపై దాడి చేసి అదుపులోకి తీసుకున్నారు. 2 కంప్యూటర్లు , 2 ల్యాప్‌టాప్‌లు, 4 ఫోన్‌లతో పాటు రూ.3.6 లక్షలు నగదు స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

పల్లెకు పచ్చందాలు

బీఆర్ఎస్ హయాంలో ఎవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా ఐదేళ్ల క్రితం నాటిన మొక్కలు కొందరు సర్పంచ్‌లు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సంరక్షించారు. ప్రస్తుతం అవి ఏపుగా పెరిగి నీడనిస్తున్నాయి. చెట్లకు పూసిన పుష్పాలు ప్రయాణికులకు ఆహ్లాదాన్నిస్తున్నాయి.

– మోమిన్‌పేట



చిన్న కొల్కుందలో ఏపుగా పెరిగిన ఎవెన్యూ ప్లాంటేషన్ మొక్కలు